ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

కడప

జిల్లా వార్తలు

5

గురువారం 6 నవంబరు 2025

సమగ్రంగా విచారణ



కలెక్టర్ ఆదేశాల మేరకు బ్రహ్మంగారిమఠంలో భూకబ్జాలను వెలికితీసేందుకు 20 ప్రత్యేక టీంలు ఏర్పాటు చేశాం. భూకబ్జాలపై సమగ్రంగా విచారిస్తాం. ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములు తిరిగి స్వాధీనం చేసుకుంటాం. నకిలీ పట్టాలు, డీఫారాలు తయారు చేసిన వారిపై పీడీ యాక్టు నమోదు చేస్తాం.

- చంద్రమోహన్, ఆర్డీవో, బద్వేలు

మెరుగైన సేవలు అందించండి


● రిమ్స్ హెచ్‌డీఎస్ సమావేశంలో కలెక్టర్



ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎమ్మెల్యే మాధవి తదితరులు

కడపసెవెన్ రోడ్స్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రిమ్స్ ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆదేశించారు. జిల్లా సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. బుధవారం రిమ్స్‌లో జీజీహెచ్, హెచ్‌డీఎస్ మీటింగ్ చైర్మన్ అయిన కలెక్టర్ ఆధ్వర్యంలో 51వ ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ సమావేశం జరిగింది. కలెక్టర్‌తో పాటు కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి, నగర కమిషనర్ మనోజ్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ కె.నాగరాజు, హెచ్‌డీఎస్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో ప్రజా స్పందనలో కడప జీజీహెచ్ మంచి ప్రతిభ కనబరిచినందుకు డాక్టర్లను అభినందించారు. అన్ని విభాగాలలో వైద్యులు అందుబాటులో ఉన్నారని తెలిపారు. కిందిస్థాయి సిబ్బంది రోగుల వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. రాయలసీమలోనే అత్యాధునిక వైద్యసేవలు అందించే మెడికల్ హబ్‌గా వైఎస్సార్ జిల్లా జీజీహెచ్ విస్తృత సేవలు అందిస్తోందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పొరేట్ స్థాయిలో మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యం దిశగా జీజీహెచ్ అభివృద్ధి సొసైటీ ముందుకెళుతోందన్నారు. అనంతరం జీజీహెచ్‌లోని అన్ని విభాగాల వైద్యాధిపతులతో కలెక్టర్ సమీక్షించారు. అజెండా మేరకు అన్ని విభాగాలలో పూర్తి వివరాలను చర్చించిన అనంతరం జీజీహెచ్‌లో అవసరమైన రూ.3.5కోట్ల విలువైన వైద్య పరికరాల కొనుగోలు ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు, రిమ్స్ ఎన్డీసీ రంగస్వామి, జీజీహెచ్ మెడికల్ కళాశాల ప్రిన్సిపదల్ జమున, సీఎస్ ఆర్ఎంఓ వై.శ్రీనివాసులు, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ ఎ.వెంకటేశ్వర్‌రెడ్డి, ఏపీవీవీపీ డీసీహెచ్ఎస్ డాక్టర్ వై.హిమదేవి తదితరులు పాల్గొన్నారు.

మఠంలో భూ-చోళ్లు



డి.ఎగువనేలటూరులో ఆక్రమణకు గురైన భూమి



● 9,646 ఎకరాల ప్రభుత్వ భూములు ఆక్రమణ
● దొంగ డీఫారాలు తయారీ ● రీసర్వేలోనూ గోల్‌మాల్
● భూకబ్జాలపై ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ప్రత్యేక గురి
● ఆక్రమణదారుల జాబితా అధికారులకు అందజేత

(కడప-ఆంధ్రజ్యోతి): పోతులూరి వీరబ్రహ్మంగారు నడయాడిన నేలలో రోజుకొక భూకబ్జా వెలుగుచూస్తోంది. వైసీపీ హయాంలో ఇక్కడ ప్రభుత్వ భూములు, వాగులు వంకలు ఆక్రమించేశారు. వీటి విలువ ఎంత తక్కువ వేసుకున్నా కూడా రూ.400 కోట్ల పైమాటే. అసైన్‌మెంటు కమిటీ లేకుండానే నకిలీ డి.పట్టాలు, దొంగ పాస్‌బుక్కులు తయారు చేసుకుని రికార్డుల్లో ఎక్కించుకున్నారు. వాటిని అడ్డదారుల్లో వెబ్‌ల్యాండ్‌లో ఎక్కించుకున్నారు. ఇక్కడ భూ కాలకేయులే సొంతంగా సబ్ డివిజన్లు చేసుకుని వాటి అనువంశికం, మార్టిగేజ్ పేరుతో రికార్డుల్లో నమోదు చేసుకున్నారు. ఒక సర్వేనంబరు ఉంటే అదనంగా మరోకటి జోడించి అడ్డగోలుగా ఎక్కించేశారు. బి.మఠం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ సొంత మండలం కావడంతో ఈ వ్యవహారంపై ఆయన ప్రత్యేకదృష్టి పెట్టారు. ఒక టీం ఏర్పాటు చేసి గ్రామాల వారీగా కబ్జాదారుల లిస్టును బయటికి తీస్తున్నారు. ఇటీవలనే అన్యాక్రాంతమైన 4846.03 ఎకరాల భూములపై ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆదేశాల మేరకు బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్ 20 విచారణ టీంలను ఏర్పాటు చేశారు. ఇప్పుడు మరలా 9646 ఎకరాల భూ స్కాం బయటకు వచ్చింది. ఇప్పటి వరకు 14,492 ఎకరాల ప్రభుత్వ అటవీ భూములతో పాటు వాగులు, వంకలు, కొండలు ఆక్రమణకు గురయ్యాయని గుర్తించారు.

కబ్జాదారుల భరతం పడతా



బి.మఠం మండలంలో భూ వివాదాలుఉన్నాయి. ప్రతిరోజూ 30 మందికి తగ్గకుండా నా దగ్గర సమస్యలు చెబుతున్నారు. కొందరు తెలీక డీకేటీ భూములు కొన్నారు. మరికొందరు ప్రభుత్వ భూములు ఆక్రమించారు. దొంగ డీఫారాలు సృష్టించి రికార్డుల్లో ఎక్కించుకున్నారు. అవన్నీ ఫేక్. ఈ భూ ఆక్రమణల వల్ల గొడవలు జరుగుతున్నాయి. అందుకే విచారణ జరిపించి అర్హులైన వారందరికీ చట్టబద్ధంగా భూములు అందిస్తాం. భవిష్యత్తులో కబ్జాలు భూవివాదాలు ఉండకుండా ప్రత్యేక దృష్టి పెట్టాను.

- పుట్టా సుధాకర్‌యాదవ్, ఎమ్మెల్యే

అధికారం అండతో..

బ్రహ్మంగారిమఠంలో 20 రెవెన్యూ గ్రామాలున్నాయి. ఆర్ఎస్ఆర్ ప్రకారం 1,03,257.240 ఎకరాల ప్రభుత్వ, ప్రైవేటు, ఆటవీశాఖ భూములున్నాయి. రెవెన్యూ భూములకు ఆర్ఎస్ఆరే ప్రామాణికం. ఇక్కడ భూములకు డిమాండ్ ఉండటంతో కొందరు వైసీపీ నేతలు అధికారం అడ్డుపెట్టుకుని అడ్డగోలుగా ఆక్రమించారు. రెవెన్యూ అధికారులు కూడా పూర్తిగా సహకరించారు. కొన్నింటిని పరిశీలిస్తే..

● రేకలకుంట రెవెన్యూ పొలం సర్వే నెంబర్ 535లో ఆర్ఎస్ఆర్ ప్రకారం 1.44 ఎకరాల భూమి ఏడబ్ల్యూగా నమోదైంది. ఇదే భూమిని 535/1 పేరుతో బ్రహ్మానందరెడ్డి పేరిట నమోదు చేశారు. సబ్ డివిజను చేయకుండానే చేసినట్లు 2019లో రికార్డుల్లో ఎక్కించుకున్నారు.

● సర్వే నెంబర్ 749లో ఆర్ఎస్ఆర్ ప్రకారం 33 సెంట్ల ప్రభుత్వ భూమి ఉంది. దీనిని 2021లో సబ్ డివిజన్ చేసి సర్వే నెంబర్ 920 కేటాయించారు. అయితే ఇక్కడ మైదుకూరు- బద్వేలు జాతీయ రహదారి రావడంతో పరిహారం కోసం 2015లోనే డిఫారం ఉన్నట్లు సృష్టించి 33 సెంట్లను 3.18 ఎకరాలుగా నమోదు చేసినట్లు చెబుతారు. 2022లో ఆన్‌లైన్ చేశారు. ఇవి ఫేక్ డాక్యుమెంట్లు అని రెవెన్యూ అధికారులు న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు.

● గుండాపురం సర్వే నెంబర్ 282లో వంద ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో 100/4 సర్వేనెంబరులో పుల్లయ్య పేరిట 4.50 ఎకరాలు నమోదు చేశారు.

● సోమిరెడ్డిపల్లెలో 2014లో జాయింట్ కలెక్టర్ భూములు రద్దు చేశారు. అయితే వాటిని కూడా ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారు.

● రీసర్వేతో భూ వివాదాలకు పుల్‌స్టాప్ పడుతుందని జగన్ హయాంలో గొప్పగా చెప్పారు అయితే రీసర్వే తరువాత దిరసవంచలో నాగరత్నమ్మ, సుబ్బరత్నమ్మ పేరిట చెరో 1.82 ఎకరాలు నమోదైంది.

● పాపిరెడ్డిపల్లె రెవెన్యూ పొలంలో ఆర్ఎస్ఆర్ ప్రకారం 4,380 ఎకరాల భూమి ఉంది. ఇక్కడ లాస్ట్ సర్వే నెంబరు 320 మాత్రమే ఉంది. అయితే దానిని ఇప్పుడు భూ కేటుగాళ్లు 420 సర్వేనెంబరు వరకు సొంతంగానే సృష్టించుకున్నారు. భూమాఫియా సృష్టించి ప్రభుత్వ భూములు కొల్లగొట్టేశారు.

గ్రామాల వారీగా ఆక్రమణకు గురైన భూమి ఎకరాల్లో..	
మల్లేపల్లె	465.217
ముడుమాల	926.16
గుండాపురం	494.64
దిరసవంచ	847.617
ఎగువ నేలటూరు	1.85
నాగిశెట్టిపల్లె	296.51
రేకలకుంట	496.329
సోమిరెడ్డిపల్లె	1669.26
పలుగురాళ్లపల్లెపార్ట్-4	302.37
పలుగురాళ్లపల్లె	1300.42
పాపిరెడ్డిపల్లె	944.26
జి.నరసింహాపురం	300.80
టి.సోదరివారిపల్లె	814.81
గొడ్లవీడు	379.3
జంగంరాజుపల్లె	261.62
డి.లింగంపల్లె	145.15
మొత్తం	**9646.329**



డి.అగ్రహారంలో వైసీపీ ఉప సర్పంచ్ ఆక్రమణలో ఉన్న భూముల్లో వేసిన నిమ్మ

ఘనంగా గంధోత్సవం



పెద్దదర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న పీఠాధిపతి ఆరిఫుల్లా హుసేని, చిత్రంలో సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్

కడప కల్చరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కడపలోని పెద్దదర్గా ఉరుసు ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా బుధవారం రాత్రి గంధోత్సవం ఘనంగా నిర్వహించారు. గంధాన్ని పీఠాధిపతి ఆరిఫుల్లా హుసేని ఇంటి నుంచి మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, ఫకీర్ల విన్యాసాలతో ఊరేగింపుగా అమీనుల్లామాలిక్ మజార్ వద్దకు తీసుకెళ్లి అక్కడ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తదుపరి గంధాన్ని భక్తులకు పంచిపెట్టారు. గంధ మహోత్సవానికి ప్రముఖ సినీ సంగీత దర్శకులు ఏఆర్ రెహమాన్ హాజరయ్యారు. తొలుత దర్గాను దర్శించుకుని అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఉరుసుకు పటిష్ట బందోబస్తు

కడప క్రైం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని అమీన్‌పీర్ పెద్దదర్గా ఉరుసు ఉత్సవాలకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ తెలిపారు. బుధవారం దర్గాలో జరుగుతున్న ఉర్సు ఉత్సవాల ఏర్పాట్లను దర్గా నిర్వాహకులు, పోలీసు అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. సుమారు 400 మంది పోలీసు సిబ్బందితో, 200 సీసీ కెమెరాల నిఘాతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మహిళల రక్షణ కోసం ప్రత్యేకంగా మహిళా సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. ఎస్పీ వెంట స్పెషల్‌బ్రాంచ్ డీఎస్పీ ఎన్.సుధాకర్, కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, నగరంలోని సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

అవకాశాలు అందిపుచ్చుకోవాలి

● ఎస్సీ కార్పొరేషన్ ఈడీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మి

కడప ఎన్జీఆర్ సర్కిల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు అందిస్తున్న రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని యువతకు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మి పిలుపునిచ్చారు. కలెక్టరేట్ సభాభవన్‌లో బుధవారం నిర్వహించిన యువ పారిశ్రామికవేత్తల అవగాహన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే వివిధ రంగాల్లో ప్రావీణ్యం ఉన్న యువత పరిశ్రమల స్థాపన కోసం మరింత ముందుకు వెళ్లాలన్నారు. అందుకోసం కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలవుతున్న రాయితీ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎల్‌డీఎం జనార్ధన్ మాట్లాడుతూ పరిశ్రమల శాఖ ద్వారా చిన్న మధ్యతరగతి పరిశ్రమల స్థాపన కోసం కేంద్ర ప్రభుత్వం కోట్లాది రూపాయల రాయితీ ఇస్తుందన్నారు. పరిశ్రమల శాఖ జనరల్ మేనేజరు చాంద్‌బాషా మాట్లాడుతూ ఇప్పటికే ఔత్సాహికులైన పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు రుణాలు ఇస్తున్నామన్నారు. రుణాలు తీసుకున్న వారు వాటిని సద్వినియోగం చేసుకుని సకాలంలో తిరిగి చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో మాదిగ కార్పొరేషన్ డైరెక్టరు మల్లేశ్, అనిత దీప్తి, యూనియన్ బ్యాంకు డీజీఎం తులసి, సతీశ్, హార్టికల్చర్ డీడీ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

తండ్రీకూతురికి జీవిత ఖైదు



జీవిత ఖైదు శిక్ష పడ్డ ముద్దాయిలు

కడప రూరల్/ జమ్మలమడుగు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని బీసీ కాలనీ లో ఓ వ్యక్తి హత్యకేసులో తండ్రీ కూతురుకు జీవిత ఖైదుతో పాటు రూ.1000 జరిమానా విధించారు. ఈ మేరకు కడప జిల్లా కోర్టు సముదాయం లోని ఎస్సీ, ఎస్టీ కోర్టు కమ్ నాల్గవ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.దీన బాబు బుధవారం తీర్పు వెలువరించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జమ్మలమడుగు బీసీ కాలనీకి చెందిన మునగాల రవి(35) డిష్ ఆపరేటర్‌గా పనిచేస్తుండేవాడు. ఇతను జమ్మలమడుగులోని నాగులకట్ట వీధికి చెందిన మాధవి(36)కి రూ.5 లక్షలు అప్పు ఇచ్చాడు. తర్వాత ఆ డబ్బు చెల్లించాలని రవి అడుగుతుండడంతో మాధవి, ఆమె తండ్రి లక్కిరెడ్డి సూర్యనారాయణరెడ్డి (73) అతడిపై కక్ష పెంచుకున్నారు. ఈ నేపథ్యంలో వీరిద్దరూ కలసి 2017 జనవరిలో రవిని దారికాచి ఇనుపరాడ్లు, కట్టెలతో దాడి చేయడంతో మృతిచెందాడు. దీనిపై రవి భార్య గంజి పద్మావతి జమ్మలమడుగు అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ సి.నాగరాజు కేసు నమోదుచేసి ముద్దాయిలు ఇద్దరిని 2017 జనవరి 30న అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. పూర్తి విచారణ అనంతరం ఇద్దరిపై చార్జ్‌షీటును నాల్గవ అదనపు జిల్లా కోర్టులో దాఖలు చేశారు. ఈ మేరకు కేసు పూర్వాపరాలను, సాక్షులను జడ్జి విచారించి నేరం చేసినట్లు నిర్ధారణ కావడంతో బుధవారం ముద్దాయిలు ఇద్దరికీ జీవిత ఖైదుతో పాటు రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

బెట్టింగ్ ముఠా గుట్టు రట్టు

● ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా బెట్టింగ్
● ఆరుగురు అరెస్టు.. రూ.6.28లక్షలు నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం : ఎస్పీ



విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

కడప క్రైం నవంబర్ 5 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఓ ముఠా గుట్టును ప్రొద్దుటూరు పోలీసులు రట్టు చేశారు. చాపాడు మండలం చిన్నగురవలూరు గ్రామానికి చెందిన పెద్దమల్ల జగన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ప్రొద్దుటూరు డీఎస్పీ ఆధ్వర్యంలో ఆరుగురు ముఠా సభ్యులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.6.28 లక్షల నగదు 8 సెల్‌ఫోన్లు, 4 బ్యాంకు పాస్ బుక్కులను స్వాదీనం చేసుకున్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో డీఎస్పీ భావన, ఎస్బీ డీఎస్పీ సుధాకర్‌తో కలసి ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించి కేసు వివరాలను వెల్లడించారు.

ప్రొద్దుటూరు మండలం లింగాపురానికి చెందిన వీరశంకర్, చంద్ర బెంగళూరులో పీజీ హాస్టల్ నడుపుతున్నారు. వీరు రాయల్‌బుక్365.కాం.ఇన్ అనే వెబ్‌సైట్ ద్వారా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. బెట్టింగ్ ద్వారా సాగే ఈ వెబ్‌సైట్ లావాదేవీలు నిర్వహించేందుకు బ్యాంక్ అకౌంట్ల కోసం చెన్నకృష్ణ, నరేంద్ర, హరి, సుధీర్‌కుమార్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రవితేజ పేర్లతో బ్యాంక్ అకౌంట్లు చేయించారు. వారికి కమీషన్ ఇస్తూ తద్వారా ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహించేవారు. అలాగే చాపాడు మండలం గురువలూరు గ్రామానికి చెందిన పెద్దమల్ల జగన్‌కు కూడా అకౌంట్ చేయించడంతో పాటు అతని పేరుపైనే సిమ్ కూడా తీసుకుని ఈ ఆన్‌లైన్ బిజినెస్ నడిపిస్తున్నారు. దీనిపై అనుమానం వచ్చిన జగన్ బ్యాంకుకు వెళ్లి తన అకౌంట్ వివరాలు తెలుసుకున్నారు. తన అకౌంట్‌లో డబ్బులు ఎక్కువగా ఉండడంతో ముఠా సభ్యులను గట్టిగా నిలదీయడంతో వారు బెదిరింపులకు పాల్పడి జగన్ వద్ద ఉన్న అతని ఏటీఎం కార్డు లాక్కున్నారు. దీంతో జగన్ ప్రొద్దుటూరు టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

డీఎస్పీ భావన ఆధ్వర్యంలో టూ టౌన్ సీఐ సదాశివయ్య, రూరల్ సీఐ నాగభూషణం ఆధ్వర్యంలో బెట్టింగ్ నిర్వాహకులపై నిఘా ఉంచారు. ఇటీవల మహిళల ప్రపంచ కప్ సందర్భంగా ఇండియా ఆస్ట్రేలియా సెమీఫైనల్‌లో తలపడినరోజు ఆన్‌లైన్ ద్వారా బెట్టింగ్‌కు పాల్పడ్డారు. దీనికి సంబంధించి లావాదేవీల విషయమై నిందితులు ఒకచోట చేరడంతో బుధవారం ప్రొద్దుటూరు మండలం లింగాపురం గ్రామానికి చెందిన ఆర్ల చెన్నకృష్ణ, ప్రొద్దుటూరు టౌన్ వైఎంఆర్ కాలనీకి చెందిన దగాదారి నరేంద్ర, అదే ప్రాంతంలోని ఈశ్వర్‌రెడ్డి నగర్‌కు చందిన మేరువ హరి, నెహ్రూ రోడ్డుకు చెందిన ఇల్లూరు సుధీర్‌కుమార్‌రెడ్డి, మోడంపల్లెకు చెందిన పల్లబోతుల కృష్ణారెడ్డి, దొరసానిపల్లెకు చెందిన సత్న రవితేజ అనేవారిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.6.28 లక్షల నగదు, 8 సెల్‌ఫోన్‌లు, 4 బ్యాంకు పాస్‌బుక్కులను స్వాధీనం చేసుకున్నారు. వీరి వద్ద నుంచే బెట్టింగ్‌నకు సంబంధించి బ్యాంకింగ్ ద్వారా రూ.8.7 లక్షలు సీజ్ చేశారు. మొత్తం 28 పాస్‌బుక్కులలో 18 కరెంట్ అకౌంట్స్, 10 సేవింగ్ అకౌంట్లద్వారా అక్రమ లావాదేవీలు చేసినట్లు గుర్తించారు. పరారీలో ఉన్న వీరశంకర్, చంద్ర కోసం ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటుచేశామని, త్వరలో వారిని అరెస్ట్ చేస్తామని ఎస్పీ తెలిపారు. ఇలాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ బెట్టింగ్ వ్యవహారంలో పోలీసు సిబ్బంది పాత్ర ఉన్నా వారిపై కూడా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

కార్తీక దీపశోభ



కడప మృత్యుంజయకుంట శివాలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు



పుష్పగిరిలో స్వామి దర్శనం కోసం క్యూలోఉన్న భక్తులు

కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం జిల్లావ్యాప్తంగా ఉన్న శైవ క్షేత్రాలలో దీపశోభ సంతరించుకుంది. భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయాలకు చేరుకుని అత్యంత భక్తిశ్రద్ధలతో దీపాలు వెలిగించి శివనామస్మరణ చేశారు. సాయంత్రం జ్వాలాతోరణాన్ని భక్తులు దర్శించుకున్నారు. ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి.



ఖాజీపేట : నాగనాథేశ్వరుని ఆలయంలో శివలింగం రూపంలో దీపాలు



జమ్మలమడుగు : కన్యతీర్థం శివాలయంలో భక్తుల క్యూ



సీకేదిన్నె మండలం బయనపల్లెలోని ఉమామహేశ్వరాలయంలో జ్వాలాతోరణం



కమలాపురం శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



ప్రొద్దుటూరు శివాలయంలో..

రెవెన్యూ సమస్యల పరిష్కారానికే శిబిరాలు: కలెక్టర్



వినతులను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

నందలూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకే జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్లలో ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నామని కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో కలెక్టర్ ప్రజల నుంచి వివిధ రకాల అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించామని, జిల్లావ్యాప్తంగా మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలో మూడు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తామన్నారు. రాజంపేట, మదనపల్లె, రాయచోటి మూడు డివిజన్లలో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో రాజంపేట సబ్‌కలెక్టర్ భావన, తహసీల్దారు అమరేశ్వరి, ఎంపీడీవో కేఆర్ఎం ప్రసాద్, ఈవోఆర్డీ సునీల్‌కుమార్, మండలంలోని ఇతర శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

బియ్యం సకాలంలో తరలించాలి

● జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్



బియ్యం గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

కలకడ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పీడీఎస్ ద్వారా ప్రజలకు పంపిణీ చేసే బియ్యం రేషన్ దుకాణాలకు సకాలంలో తరలించాలని జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆయన కలకడలోని సివిల్ సప్లయ్ గోడౌన్‌ను పరిశీలించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే బియ్యం నిల్వల గురించి ఆరా తీశారు. పంపిణీలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని సీఎస్‌డీటీకి సూచించారు. గోడౌన్ అద్దె భవనంలో నిర్వహిస్తున్న దృష్ట్యా పక్కా భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఎంపిక చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహేశ్వరిబాయి, సీఎస్‌డీటీ రమేష్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిపై యాసిడ్ దాడి

రాజంపేటటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హత్యరాల గ్రామంలో మన్యం రవిపై బుధవారం కొందరు యాసిడ్‌తో దాడిచేసి గాయపరిచారు. వివరాల్లోకి వెళితే... ప్రకాశం జిల్లా రాజుపూరి గ్రామానికి చెందిన మన్యం రవి ఆరేళ్ల క్రితం హత్యరాలకు చెందిన సుబ్బరత్న అనే అమ్మాయిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. అప్పటి నుంచి అతనిపై అమ్మాయి తరపు బంధువులు గతంలో రెండుసార్లు దాడి చేసినట్లు బాధితుడు తెలిపాడు. ఇందులో భాగంగానే ప్రస్తుతం కూడా తనపై వారే దాడి చేశారని ఆరోపిస్తున్నాడు. అయితే దాడి చేసిన వ్యక్తి హత్యరాల గ్రామానికి చెందిన వ్యక్తిగా చెబుతున్నాడు. కాగా బాధితుడు రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయంపై మన్నూరు సీఐ ప్రసాద్‌బాబు కేసు నమోదు చేసి ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. దాడి చేసిన వారిని గుర్తించాల్సి ఉందని ఆయన తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కుటుంబకలహాలతో మహిళ ఆత్మహత్యాయత్నం చేసుకుందని పోలీసులు తెలిపారు. పీటీఎం మండలం రంగసముద్రంలో చోటు చేసుకున్న సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాల మేరకు రంగసముద్రం వాసులు లక్ష్మీదేవి, ఈశ్వరప్ప కుమార్తె భార్గవిని రెండేళ్ల కిందట అనంతపురం జిల్లా కదిరి పట్టణానికి చెందిన సాయివినయ్‌కుమార్‌కు ఇచ్చి వివాహం చేశారు. భార్యాభర్తలు ఇద్దరు ఓ కోళ్లఫారంలో పనిచేస్తున్నారు. మూడు రోజుల కిందట కుటుంబ కలహాల కారణంగా భార్గవి పుట్టింటికి వచ్చింది. బుధవారం ఉదయం క్రిమిసంహారిణి తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం డాక్టర్లు తిరుపతికి రెఫర్ చేశారు. ఈ మేరకు పీటీఎం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

వృద్ధుడిపై ఎలుగుబంటి దాడి

సిద్దవటం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చలమారెడ్డి కొట్టాల కు చెందిన గోపాలయ్య (75)పై ఎలుగుబంటి దా డి చేసింది. లంకమల్ల అ భయారణ్యం రిజర్వు ఫారెస్ట్ పరిధిలోని వన్నేశ్వరం వంక ప్రాంతానికి వెళ్లిన గోపాలయ్యపై అకస్మాత్తుగా ఎలుగుబంటి దాడి చేసింది. తల, కన్ను, చెవి, దవడ వద్ద తీవ్ర గాయాలయ్యాయి. దాని బారి నుంచి తప్పించుకుని గ్రామానికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని కడప రిమ్స్‌కు తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు మేఘశ్రీ ఎంపిక



మేఘశ్రీ

పెద్దతిప్పసముద్రం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు పెద్దతిప్పసముద్రం మండలం కాట్నగల్లు వాసి మేఘశ్రీ ఎంపికైనట్లు మండల విద్యాశాఖాధికారులు నారాయణ, గౌస్‌పీర్ తెలిపారు.

ఈనెల 8, 9వ తేదీల్లో శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి హైజంప్ పోటీల్లో పాల్గొననుంది. మేఘశ్రీ ములకలచెరువు బాలికల గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. వారం రోజులుగా మండల, నియోజకవర్గం, జిల్లాస్థాయిలో జరిగిన హైజంప్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి హైజంప్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన గురుకుల పాఠశాల విద్యార్థిని మేఘశ్రీని ఆ పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, అధికారులు అభినందించారు.

ఇంటి పన్ను వసూళ్లలో వెనుకబడ్డాం

● బకాయిలు రూ.17 కోట్లు.. వసూలైంది రూ.17 లక్షలు
● డీపీవో రాధమ్మ



పీలేరు పంచాయతీ కార్యాలయంలో మాట్లాడుతున్న డీపీవో రాధమ్మ

పీలేరు రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇంటి పన్ను వసూళ్లలో వెనుకబడ్డామని జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) రాధమ్మ తెలిపారు. బుధవారం ఆమె పీలేరు పంచాయతీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ట్యాక్స్ వసూళ్లలో వేగం పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఇకపై పన్ను ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చన్నారు. ఇంటి యజమాని ఫోన్‌కు మెసేజ్ వస్తుందని, అందుకు అనుగుణంగా ట్యాక్స్ చెల్లించవచ్చని ఆమె చెప్పారు. పన్ను వసూళ్లలో జిల్లా టార్గెట్ రూ.14.96 కోట్లని, గత ఏడాది అరియర్స్‌తో రూ. 2.67 కోట్లు ఉందన్నారు. మార్చి 31 నాటికి జిల్లాలో అరియర్స్‌తో కలిపి రూ.17.63 కోట్లు వసూలు చేయాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు కేవలం జిల్లాలో రూ.17 లక్షలు మాత్రమే వసూలు చేసినట్లు ఆమె తెలిపారు. విధి నిర్వహణలో నిర్లక్ష్య ధోరణి అవలంభించరాదని, కష్టం తెలియకుండా ఉద్యోగం చేయాలంటే కుదరదని హెచ్చరించారు. చాలా మందిలో భయంలేనితనం ఉందని, దూర ప్రాంతాలకు వెళ్లకుండా ఇంటి ముందే ఉద్యోగం చేయడమే ప్రధాన కారణమన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తే బదిలీలు తప్పవని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా శానిటేషన్‌పై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, అంటురోగాలు ప్రబలకుండా పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో ముందుకు పోవాలని సూచించారు. పీలేరులోని మినరల్ వాటర్ ప్లాంట్లలో పనిచేస్తున్న వర్కర్ల పెండింగ్ జీతాలు చెల్లిస్తామని తెలిపారు. పట్టణంలో పనిచేస్తున్న 26 మినరల్ వాటర్ ప్లాంట్లలో పనిచేస్తున్న వర్కర్లకు నెలకు రూ.6 వేలు చొప్పున 14 నెలలు జీతాలు చెల్లించాల్సి ఉందని, దీనిపై కలెక్టర్‌తో సంప్రదించి వీలైనంత త్వరగా పెండింగ్ జీతాలు ఇప్పిస్తామని ఆమె చెప్పారు. పెండింగ్ జీతాలు చెల్లించిన అనంతరం ప్రస్తుతం పనిచేస్తున్న వర్కర్లను తొలగించి వారి స్థానంలో పంచాయతీ వర్కర్లనే నియమించి పట్టణ ప్రజలకు తాగునీరు అందిస్తామని తెలిపారు. సమావేశంలో ఈవో బ్రహ్మానందరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల్లో వసతులు కల్పించాలి

● ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరాజు



మోడల్ స్కూల్ తరగతి గదుల్లో వసతులను పరిశీలిస్తున్న అధికారులు

తంబళ్లపల్లె, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): టెన్త్ పబ్లిక్ పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు తప్పనిసరిగా కల్పించాలని ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ కొండూరు శ్రీనివాసరాజు ఆదేశించారు. పాఠశాల విద్యా కమిషనర్ విజయరామరాజు ఆదేశాల మేరకు బుధవారం ఆయన ఎంఈవోలతో కలిసి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్ టెన్త్ పరీక్షా కేంద్రాల్లో వసతులను పరిశీలించారు. కేంద్రాల్లో తరగతి గదులు, డెస్కులు, విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు, తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులను పరిశీలించారు. పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకాల ప్రకారం కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు సమగ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎంఈవోలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు, హెచ్ఎంలు హేమంత్‌కుమార్, శ్రీనివాసులు, సూపరింటెండెంట్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

12మంది బైండోవర్

నిమ్మనపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండ్లపై పంచాయతీ భూమలగడ్డ గ్రామంలోని ప్రభుత్వ భూమి అక్రమణలో 12 మందిని తహసీల్దార్ తపస్విని ఎదుట బైండోవర్ చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ భూమలగడ్డ గ్రామం సర్వే నెంబరు, 28-5లో ఉన్న 6 ఎకరాల 70 సెంట్ల ప్రభుత్వ భూమిని ఎలాంటి అనుమతులు లేకుండా అదే గ్రామానికి చెందిన 12 మంది అక్రమించుకుని చదును చేస్తుండగా అడ్డుకుని కంచె ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ భూమిని ఎవరైనా ఆక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కాగా మాజీ సైనికుల్లో కొందరికి ఇదే స్థలంలో చెట్ల పెంపకానికి టూసీ పట్టాలు ఇచ్చినట్లు మాజీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులునాయుడు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ రాంప్రసాద్, వీఆర్ఓ క్రిష్ణప్ప, పోలీసులు పాల్గొన్నారు.

వల్లభాయ్ పటేల్ ఆశయాలను కొనసాగిద్దాం

● రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



ఐక్యతా దివస్ ర్యాలీలో పాల్గొన్న మంత్రి మండిపల్లి, కూటమి నాయకులు

రాయచోటిటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయాలను కొనసాగిద్దామని మంత్రి మండపల్లి రాంప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఆయన రాయచోటి పట్టణంలోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జాతీయ ఐక్యతా దివస్ కార్యక్రమంలో కూటమి నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2014లో భారత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఐక్యతా దివస్ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. మన దేశానికి ఉక్కు మనిషిగా పేరుగాంచిన సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ప్రతి ఏడాది ఐక్యతా దివస్ కార్యక్రమాన్ని జరుపుతారన్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించడంలో కీలక పాత్ర పోషించిన వల్లభాయ్ పటేల్ స్వాతంత్ర్యం అనంతరం కూడా దేశ సేవ కోసం తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. అలాంటి మహోన్నత వ్యక్తి ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్, రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేశ్‌నాయుడు, జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ పాలగిరి శ్రీనివాస్‌కుమార్‌రాజు, జిల్లా కార్యదర్శి ఆనందగజపతిరాజు, సీనియర్ నాయకులు అరమాటి శివగంగిరెడ్డి, బీజేపీ నాయకులు జానం బాలాజీ యాదవ్, రాజశేఖర్‌రెడ్డి, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించండి




సమావేశంలో మాట్లాడుతున్న వాసునూరి చంద్రశేఖర్

కలికిరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): త్వరలో ప్రారంభం కానున్న ప్రతిష్ఠాత్మక ఆదరణ 3.0 పథకాన్ని శాస్త్రీయ పద్ధతుల్లో అమలు చేయాలని, వివిధ బీసీ కులాల వారికి వారి జనాభా ప్రాతిపదికన దామాషా మేరకు నిధులు కేటాయించాలని రాష్ట్ర జంగమ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వాసునూరి చంద్రశేఖర్ స్పష్టం చేశారు. రూ.వేయి కోట్లతో అమలు చేయనున్న ఆదరణ 3.0 పథకం విధివిధానాల కోసం బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత బుధవారం రాజధానిలో వివిధ బీసీ కార్పొరేషన్ల చైర్మన్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాత కులవృత్తులు మనుగడ కోల్పోయి ఆధునిక వృత్తులైన ఎలక్ట్రికల్ కుట్టు మిషన్‌లు, జిగ్‌జాగ్, ఎంబ్రాయిడరీ మిషన్లను ఉపయోగించడంలో మహిళలు తర్ఫీదు పొందారని మరి కొందరికి వాషింగ్ మిషన్లు, ఎలెక్ట్రికల్ ఐరన్ బాక్సులు అందజేయాలని చంద్రశేఖర్ సూచించారు.

ప్రధానంగా జంగం కులస్తులకు ప్రభుత్వం ప్రకటించిన 100 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అన్ని జిల్లాల్లో అమలు చేయాలని కోరారు. గతంలో రూ.30 వేల వంతున ఇస్తున్న ఆర్థిక చేయూతను రూ.లక్షకు పెంచాలని చెప్పారు. కాగా బీసీ జనాభా వివరాలను కులాల వారీ కలెక్టర్ల నుంచి తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు చంద్రశేఖర్ తెలిపారు. బీసీ సంక్షేమ వసతి గృహాలను కార్పొరేషన్ చైర్మన్లు తరచూ తనిఖీ చేయాలని మంత్రి సూచించినట్లు చెప్పారు. కార్పొరేషన్ చైర్మన్లకు దేవాలయాల్లో ప్రొటోకాల్ పాటించేలా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసేందుకు మంత్రి హామీ ఇచ్చారు.

రెవెన్యూ డివిజన్ కేంద్రంగా పీలేరు?

● సీసీఎల్‌ఏకు ప్రతిపాదనలు పంపిన మంత్రివర్గ ఉపసంఘం



పీలేరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కొత్త జిల్లాల ఏర్పాటులో భాగంగా పీలేరు ప్రాంత వాసులకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పే అవకాశం కనిపిస్తోంది. అమరావతిలో బుధవారం జిల్లాల పునర్విభజనపై మంత్రివర్గ ఉపసంఘం భేటీ జరిగింది. ఈ సందర్భంగా పీలేరును రెవెన్యూ డివిజన్ కేంద్రం చేయాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ మేరకు సీసీఎల్‌ఏకు ప్రతిపాదనలు పంపినట్లు తెలుస్తోంది.

పీలేరు నియోజకవర్గంలో.. : పీలేరు, కేవీపల్లె, కలకడ, గుర్రంకొండ, కలికిరి, వాల్మీకిపురం మండలాలు ఉన్నాయి. వీటిలో పీలేరు, కేవీపల్లె, కలకడ, గుర్రంకొండ మండలాలు రాయచోటి రెవెన్యూ డివిజన్‌లో, కలికిరి, వాల్మీకిపురం మండలాలు మదనపల్లె డివిజన్‌లో ఉన్నాయి. ఒక నియోజకవర్గంలోని అన్ని మండలాలు ఒకే రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉండాలన్న ప్రభుత్వ అభిమతం మేరకు పీలేరు నియోజకవర్గంలోని ఆరు మండలాలను ఒకే రెవెన్యూ డివిజన్ పరిధిలోకి చేర్చే అవకాశం ఉంది. అయితే ప్రస్తుతం పుంగనూరు నియోజకవర్గంలో ఉంటూ చిత్తూరు రెవెన్యూ డివిజన్‌లో ఉన్న రొంపిచెర్ల, పులిచెర్ల మండలాలు, పలమనేరు డివిజన్‌లో ఉన్న సదుం, సోమల మండలాలను కూడా ప్రతిపాదిత పీలేరు రెవెన్యూ డివిజన్‌లో కలపాలన్న డిమాండ్లు ఉన్నాయి. దీంతో వీటిని కూడా కలిపి పీలేరును రెవెన్యూ డివిజన్ కేంద్రం చేయనున్నారని సమాచారం. పీలేరును రెవెన్యూ డివిజన్ చేస్తే.. పుంగనూరు, పీలేరు నియోజకవర్గాల్లోని మండలాల వారు చేరుకోవాలంటే డివిజన్ కేంద్రం కేవలం 30 కి.మీ దూరం మాత్రమే ఉంటుంది.

నీటమునిగిన ఆటో డ్రైవరు మృతి

పెనగలూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింగరాజపురం గ్రామ పంచాయతీ పరిధిలోని పల్లంపాడు గ్రామానికి చెందిన గండికోట వెంకటేశ్ (30) అనే ఆటో డ్రైవర్ బుధవారం సాయంత్రం నీటమునిగి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు... వెంకటేశ్ ఆటో తోలుకుంటూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం కూడా పెనగలూరు బస్టాండు నుంచి ప్యాసింజర్లను ఆటోలో ఎక్కించుకుని కోడిచిన్నయగారిపల్లెలో దింపి ఆటోను పార్కింగ్ చేశాడు. మోకాటి లోతు చెయ్యేటిలో నడుచుకుంటూ పల్లంపాడుకు చేరుకున్నాడు. అనంతరం సాయంత్రం బహిర్భూమికి వెళ్లి గ్రామదేవత పల్లమ్మగుడి వెనుకాల గల చెయ్యేటిలో కాళ్లు, చేతులు శుభ్రం చేసుకునేందుకు నీటిఒడ్డుకు వెళ్లాడు.

కాళ్లు జారి ప్రమాదవశాత్తు నీటిలో పడ్డాడు. గమనించిన ఇద్దరు వ్యక్తులు వెంటనే గట్టిగా కేకలు వేయడంతో సమీపంలోని ప్రజలు, కుటుంబ సభ్యులు ఏటివద్దకు చేరుకుని నీటమునిగిన వెంకటేశ్‌ను బయటకు తెచ్చారు. వెంటనే 108 అంబులెన్స్ ద్వారా పెనగలూరు పీహెచ్‌సీకి తరలించారు. డ్యూటీ నర్సు శాంతి ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించారు. కాగా అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. కాగా పెనగలూరు ఏఎస్‌ఐలు ఎ.రాముడు, మల్లికార్జున ఆసుపత్రికి వచ్చి వివరాలు సేకరించారు. మృతుడికి భార్య, మూడేళ్ల లోపు ఇద్దరు పిల్లలు, తల్లి ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గ్రామంలో సౌమ్యుడిగా పేరు తెచ్చుకున్న వెంకటేష్ అకాల మరణం పట్ల పల్లంపాడులో విషాదఛాయలు అలముకున్నాయి.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

అటవీ క్షేత్రాధికారి జయప్రసాదరావు



ఆలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న దృశ్యం

పీలేరు రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మొక్కల పెంపకంతో పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని పీలేరు రేంజ్ అటవీ క్షేత్రాధికారి జయప్రసాద్, ఎస్ఐ లోకేశ్ తెలిపారు. బుధవారం మద్దుండాల మల్లేశ్వరస్వామి ఆలయ ఆవరణలో కార్తీక వన సమారాధనలో భాగంగా మొక్కలు నాటిన వారు మాట్లాడుతూ రోజురోజుకు వాతావరణ కాలుష్యం పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విపత్కర పరిస్థితుల నుంచి బయటపడాలంటే విరివిగా మొక్కలు నాటి సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. లేదంటే భవిష్యత్ అంధకారమేనని తెలిపారు. మొక్కుబడిగా మొక్కలు నాటి వదిలేయడం వల్ల ఎటువంటి ఉపయోగం ఉండదని హెచ్చరించారు. వాతావరణ కాలుష్యం పెరిగిపోతున్న కారణంగా అతివృష్టి, అనావృష్టి వంటి సమస్యలు ఉత్పన్నమౌతున్నాయని వివరించారు. పర్యావరణ పరిరక్షణలో అందరినీ భాగస్వాములను చేయడం కోసం తరచూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో తలపుల మాజీ సర్పంచ్ అబ్బవరం అమరనాథరెడ్డి, హరిబాబు నాయుడు, తలపుల బీటు అధికారి శ్రీనివాసన్, వన సంరక్షణ సమితి, ఆలయ కమిటీ సభ్యులు లింగమ్మ, వెంకటరమణ, వెంకటయ్యనాయుడు, చెంగల్‌రాయులు, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

13న మెగా జాతీయ లోక్‌అదాలత్

వాల్మీకిపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం జూనియర్ సివిల్ కోర్టులో డిసెంబరు 13న జరగనున్న జాతీయ మెగా లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జడ్జి గురు అరవింద్ బుధవారొ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్షణికావేశంలో కేసులు పెట్టుకోవడం ద్వారా జీవితాలు దుర్భరం అవుతాయని, కేసులతో సతమతమవుతున్న కక్షిదారులకు రాజీమార్గం ద్వారా పరిష్కరించుకునేందుకు జాతీయ లోక్‌అదాలత్ చక్కటి వేదిక అని తెలియజేశారు. సివిల్, క్రిమినల్, బ్యాంకుల రుణాలు, రాజీకాదగ్గ కేసులన్నింటినీ పరిష్కరిస్తారని కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోలీసులు, న్యాయవాదులు కూడా సహకరించి జతీయ మెగా లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేయాలని సూచించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం నాగలక్ష్మి

కురబలకోట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి క్రికెట్, వాలీబాల్ జట్టుకు అంగళ్లు జడ్పీహైస్కూల్ విద్యార్థులు నేత్ర, ఇమ్రాన్ ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం నాగవేణి తెలిపారు. కురబలకోట మండలం తెట్టు పంచాయతీ రిషివ్యాలీ వాసులు రాజేంద్రనాయుడు కుమార్తె నేత్ర, అంగళ్లుకు చెందిన మౌలాలి కుమారుడు ఇమ్రాన్ టెన్త్ చదువుతున్నారు. చిత్తూరులో జరిగిన అండర్-17 స్కూల్ గేమ్స్ పోటీల్లో సత్తా చాటి మహిళల క్రికెట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి జట్టుకు నేత్ర ఎంపికైంది. ఈమె ఎన్‌టీఆర్ జిల్లాలో జరిగే పోటీల్లో పాల్గొంటుందన్నారు. ఇటీవల అంగళ్లులో జరిగిన అండర్-17 స్కూల్ గేమ్స్ పోటీల్లో ఇమ్రాన్ వాలీబాల్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికయ్యాడు. కాగా విద్యార్థి పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరులో ఈనెల 20 నుంచి 24 వరకు జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైన విద్యార్థులను ఎంఈవో ద్వారకనాథ్, హెచ్ఎం నాగలక్ష్మి, పీడీ రమేశ్ తదితరులు అభినందించారు.

వంద శాతం మార్కులు సాధించాలి

విద్యార్థులతో డ్వామా పీడీ వెంకటరత్నం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డ్వామా పీడీ వెంకటరత్నం

రామాపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మార్చిలో జరగనున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు వందశాతం మార్కులు సాధించాలని డ్వామా పీడీ వెంకటరత్నం అన్నారు. మండల పరిధిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో బుధవారం ఆయన 10వ తరగతి విద్యార్థులకు చదువు పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి మార్కులు సాధించి ఉన్నత స్థాయికి వెళ్లినప్పుడే అటు తల్లిదండ్రులకు, చదువు చెప్పిన గురువులకు మంచిపేరు వస్తుందన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు బానిస కాకుండా మంచిగా చదువుకోవాలన్నారు. విద్యార్థులు ప్రతిరోజు స్నానం చేసి పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యంగా ఉంటారని ఆయన అన్నారు. అనంతరం మెనూ ప్రకారంగా భోజనాలు అందిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రామకృష్ణుడు, కళాశాల ప్రిన్సిపాల్, ఏపీవో పెంచలయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.లక్ష సాయం

నారా లోకేశ్ ఆదేశాలతో ఆదుకున్న కట్టా దొరస్వామినాయుడు



ఆర్థికసాయం అందజేస్తున్న టీడీపీ యువ నేత కట్టా దొరస్వామినాయుడు

మదనపల్లె, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): షమీవుల్లా కుమారుడు అయాన్ చికిత్స కోసం బుధవారం తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ యువనేత కట్టా దొరస్వామినాయుడు రూ.లక్ష అందజేశారు. మెట్లపై ఆడుకుంటూ బాలుడు కిందపడడంతో తీవ్ర అస్వస్థతకు గురై బెంగళూరులోని రెయిన్‌బో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

నిరుపేద కుటుంబం కావడంతో చికిత్స చేయించుకునేందుకు ఆర్థిక స్థోమత లేదని ఆదుకోవాలని బాలుడి తండ్రి షమీవుల్లా సామాజిక మాధ్యమాల్లో పెట్టడంతో మంత్రి నారా లోకేశ్ స్పందించి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో కట్టా దొరస్వామినాయుడు మదనపల్లెలోని పార్టీ కార్యాలయంలో తన వంతు సాయంగా రూ.లక్షను సమీవుల్లా కుటుంబానికి అందజేశారు. కట్టా దొరస్వామినాయుడు మాట్లాడుతూ నిరుపేదలను ఆదుకునేందుకు టీడీపీ అండగా ఉంటుందన్నారు. బాలుడు పూర్తిగా కోలుకుని ఇంటికి వచ్చే వరకు టీడీపీ అండగా ఉంటుందన్నారు.

ఉద్యాన పంటలకు తెగుళ్లు

● మందులు పిచికారి చేసినా అదుపు కాని పరిస్థితి ● దిగుబడి తగ్గుతుందని రైతుల్లో ఆందోళన



బొబ్బడాల తెగులు సోకిన పసుపు పంట

రాజుపాలెం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించే రైతన్నలను ఎడతెరిపి లేని వర్షాలు కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. లక్షల రూపాయలు వెచ్చించి సాగు చేసిన ఉద్యాన పంటలకు తెగుళ్లు సోకడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. పసుపులో బొబ్బడాల తెగులు, ఆకుతోటల్లో ఆకులు పసుపు వర్ణంలోకి మారడంతో రైతన్నలకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది.

రాజుపాలెం మండలంలోని టంగుటూరు, కొట్టాల, దువ్వూరు మండలంలోని కానగూడూరు, జిల్లెల్ల, భాకరాపేట తదితర గ్రామాల రైతులు దాదాపు 350 ఎకరాల పైబడి పసుపుం పంట సాగు చేశారు. పంట ఊటపర్వం (కొమ్ములు సాగే) దశలో అధిక వర్షాలకు తేమ శాతం ఎక్కువై పంటలకు బొబ్బడాల తెగులు సోకింది. కార్తీక మాసంలో ఊట పర్వం మొదలై డిసెంబరు వరకు మంచి దిగుబడినిచ్చే తరుణంలో తెగుళ్లు సోకాయి. రైతులు మందు లు పిచికారి చేసినా అదుపు కావడం లేదు. కొమ్ముల్లో పురుగు ఏర్పడి, మొదటి దశలోనే కుళ్లు తెగులు పడిందని రైతులు తెలి పారు. ప్రభుత్వం కూడా దెబ్బతిన్న పంటలకు ఆర్థికసాయం అందించాలని కోరుతున్నారు. ఒక ఎకరాకు ఒకటిన్నర లక్ష పైబడి ఖర్చు వస్తుందని.. 30 క్వింటాళ్ల దిగుబడి వస్తే ఇప్పుడున్న రేటు ప్రకారం రూ.2.50 లక్షలు వస్తుందని.. ఈ తెగుళ్ల వల్ల దిగుబడి తగ్గుతుందని రైతులు వాపోతున్నారు.

భారీ పెట్టుబడులు పెట్టి కంటికి రెప్పలా కాపాడుకుంటున్న ఆకుతోటలు అధిక వర్షాలకు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆకులు వచ్చే తరుణంలో తమల పాకులు లేత ఆకుపచ్చగా ఉండాలని.. అలా కాకుండా పసుపు వర్ణం తిరగడం ద్వారా తీగ చనిపోవడంతో పాటు దిగుబడులు కూడా తగ్గుతాయని రైతులు సతమతమవుతున్నారు. ఇప్పటికైనా ఉద్యానశాఖాధికారులు పసుపు, ఆకుతోటలను పరిశీలించి తగు సూచనలు సలహాలు ఇవ్వాలని పలువురు రైతులు కోరుతున్నారు.



పసుపు వర్ణం తిరిగిన ఆకుతోట

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం, ఆదాయం

● ప్రాజెక్టు జిల్లా మేనేజర్ ప్రవీణ్‌కుమార్



ఘన జీవామృతం తయారీని వివరిస్తున్న డీపీఎం

పులివెందుల రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం జీవకోటికి ఆరోగ్యకరం, రైతులకు ఆదాయకరమని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు జిల్లా మేనేజర్ ప్రవీణ్‌కుమార్, అడషనల్ డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు మేనేజర్ వసంతకుమారిలు సూచించారు. బుధవారం పట్టణంలోని ఏపీ కార్ల్‌లోని వ్యవసాయ కళాశాలలో మూడో రోజు ఐసీఆర్పీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా 400 కేజీల ఘనజీవామృతం తయారీని చేసి చూపించారు. ఘనజీవామృతం పంటలకు ఏ విధంగా పనిచేస్తుంది, ఇతర ప్రయోజనాలను వివరించారు. ఇక్కడ నేర్చుకున్న అంశాలను గ్రామాలలోని రైతులకు వివరించి వారిని ప్రకృతి వ్యవసాయం వైపు నడిపించాలన్నారు. దిగుబడి, ఆదాయం గురించి క్షుణ్ణంగా వివరించాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సురేష్, ఉష, మనోజ్, భరత్, సందీప్, రబ్బాని తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం...

● కాపాడిన పోలీసులు



రైల్వేట్రాక్‌పై ఉన్న రసూల్‌తో మాట్లాడుతున్న పోలీసులు

వల్లూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన వల్లూరు గ్రామానికి చెందిన రసూల్ అనే వ్యక్తి స్థానిక గంగాయపల్లె రైల్వేస్టేషన్ వద్ద ఆత్మహత్యకు యత్నించారు. విషయం తెలుసుకన్న ఎస్ఐ పెద్ద ఓబన్న సిబ్బందిని అప్రమత్తం చేసి అతన్ని కాపాడారు. వివరాలిలా.. కుటుంబ సమస్యలతో మనస్థాపానికి గురైన రసూల్ గంగాయపల్లె రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వేట్రాక్‌పై పడుకుని ఆత్మహత్యకు యత్నించారు. ఈ సమచారం పుష్పగిరిలో బందోబస్తులో ఉన్న ఎస్ఐకి ఫోన్ ద్వారా అందడంతో వెంటనే స్పందించి... సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఎస్ఐ సూచనలతో కానిస్టేబుళ్లు అంజిప్రసాద్, సురేంద్ర సకాలంలో సంఘటనా స్థలానికి చేరుకొని రసూల్‌ను కాపాడి పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చారు. జీవితం చాలా విలువైనదని, సమస్యలు వస్తే ఎదుర్కోవాలి తప్ప ఇలా చేయకూడదని కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పోలీసుస్టేషన్ పిలిపించి అప్పగించారు. కాగా, రసూల్‌ను కాపాడిన ఎస్ఐ, పోలీసులకు ప్రజలు అభినందనలు తెలిపారు.

విద్యుత్ తీగలు తగిలి వ్యక్తి మృతి



జయన్న మృతదేహం

కాశినాయన నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) మండలంలోని వరికుంట్ల గ్రామానికి చెందిన వరికుంట్ల పోలయ్య కుమారుడు జయన్న(47) ప్రమాదవశాత్తు కరెంట్ తీగ తగిలి షాక్‌కు గురై మృతి చెందాడు. ఎస్ఐ యోగేంద్ర వివరాల మేరకు... వరికుంట్ల జయన్న తన చిన్నాన్న సంటయ్య పొలానికి అడవి పందులు రాకుండా కట్టెలు పాతి చుట్టూ కరెంట్ తీగలు ఏర్పాటు చేశారు. రోజులాగే మంగళవారం రాత్రి కరెంట్ తీగలు తగిలించేందుకు పొలం వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు పొలానికి ఏర్పాటు చేసిన కరెంట్ తీగ కాలికి తగిలి జయన్న షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. బుధవారం ఉదయం పశుకాపరులు గమనించి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. ఈవిషయం పోలీసులు, ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు వెళ్లి పరిశీలించారు. ఆమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యోగేంద్ర తెలిపారు.

శ్మశాన వాటిక లేక.... శవంతో నిరసన



భూమి యజమానితో మాట్లాడుతున్న తహసీల్దారు శివరామిరెడ్డి

కమలాపురం రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు అవుతున్నా ఇంకా కొన్ని గ్రామాలకు శ్మశానవాటిక లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ఈడిగపల్లెలో యాదవ సామాజిక వర్గానికి ఇప్పటికీ శ్మశాన వాటిక లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. గ్రామం సగం కొండాయనల్లె పంచాయతీ, మరో సగం గ్రామ పెద్దచెప్పలి పంచాయతీలోకి వస్తుంది. పెద్దచెప్పలి పంచాయతీలోని సుమారు 15 యాదవ కుటుబాల వారికి అంత్యక్రియలు చేసుకునేందుకు స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఊరి సమీపంలో సర్వే నెంబరు 5లో స్థలం ఉండడంతో అక్కడే అంత్యక్రియలు నిర్వహించేవారు. ఆ స్థలాన్ని ఓ నాయకుడు పట్టా చేయించుకుని పంటలు సాగు చేసుకుంటుండడంతో సమస్య తలెత్తింది. ఈ నేపథ్యంలో బుధవారం గ్రామానికి చెందిన వృద్ధురాలు నాగమ్మ మృతి చెందడంతో ఎక్కడా అంత్యక్రియలు చేసుకోనివ్వకపోవడంతో శవంతో యాదవ కులస్తులు నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న తహసీల్దారు శివరామిరెడ్డి సిబ్బందితో గ్రామానికి చేరుకుని వారితో మాట్లాడారు. మేం ఊరు పుట్టినప్పటి నుంచి ఇక్కడే నివాసం ఉన్నామని.. అయినా మాకు శ్మశాన వాటిక లేకపోవడం దారుణమన్నారు. స్పందించిన తహసీల్దారు ముందుగా ఇచ్చిన పట్టా స్థలం యజమానులతో మాట్లాడానని.. అక్కడ అంత్యక్రియలు చేసుకోవాలని చెప్పడంతో సాయంత్రం అంత్యక్రియలు పూర్తి చేశారు. త్వరలో శ్మశానవాటిక ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తహసీల్దారు చెప్పడంతో గ్రామస్తులు శాంతించారు.

పదిలో వందశాతం ఫలితాలు సాధించాలి : డీఈవో



గొంటువారిపల్లె ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన డీఈవో

కాశినాయన నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని డీఈవో షంషుద్దీన్ పేర్కొన్నారు. బుధవారం ఆయన ఇటుకులపాడు, నర్సాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలతో పాటు గొంటువారిపల్లె, వరికుంట్ల ప్రాథమికోన్నత పాఠశాలలను తనిఖీ చేశారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రతి విద్యార్థి ప్రాథమిక దశ దాటే సమయానికి తెలుగు, ఇంగ్లీషు చదవడం, రాయడం లాంటివి తప్పనిసరిగా నేర్పించాలన్నారు. అలాగే విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన మధ్యాహ్నా భోజనం అందించేలా చూడాలన్నారు. అనంతరం నర్సాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మిస్తున్న స్మార్ట్ కిచెన్ సెంటర్ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవోలు మహమ్మద్ షఫీ, నిర్మల ప్రధానోపా ధ్యాయుడు నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫౌండేషన్ డేను విజయవంతం చేయాలి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో ప్రతి ఒక్క యూనిట్ లీడర్ తమ యూనిట్ సభ్యులతో కడప నగరం శంకరాపురంలోని జిల్లా ప్రధాన కార్యాలయం పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా చీఫ్ కమీషనర్, సెక్రటరీ జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ షంషుద్దీన్ పేర్కొన్నారు. ఈనెల 7వ తేదీన ఉదయం 8గంటలకు జరగనున్న ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్క యూనిట్ లీడర్ తమ విద్యార్థుల బయోడేటాని అందించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, త్వరలో జరిగే రాజ్యపుర స్కార్, తృతీయ సోపాన క్యాంప్‌నకు సంబంధించిన అప్లికేషన్లను అందజేయాలన్నారు. ఏదైన టెక్నికల్ సమస్యలు, ఓవైఎంఎస్ సమస్యలు ఉన్నచో కెపాసిటీ బిల్డింగ్ వర్క్ షాప్‌లో పాల్గొని తగు విషయాలను తెలుసు కోవాల్సిందిగా ఆయన పేర్కొన్నారు.

డ్రాగా ముగిసిన క్రికెట్ మ్యాచ్‌లు



ప్రణవ్‌గోవర్ధన్, మణిదీప్, ముఖేష్ మోక్షజ్ఞ, హేమచందర్‌నాయక్

కడప స్పోర్ట్స్, నవంబర్ 5 (ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య జరుగుతున్న ఏసీఏ అండర్ 14 మెన్ మల్టీడే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లు బుధవారం డ్రాగా ముగిశాయి. వివారాలిలా........

కడప నగర రిమ్స్ సమీప వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో నెల్లూరు- చిత్తూరు జట్ల మధ్య సాగు తున్న మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు చేసిన నెల్లూరు జట్టు మొదటి రోజు (మంగళవారం) ఆట ముగిసే సమయానికి 51.4 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 184 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. ఓవర్ నైట్ స్కోర్‌తో తిరిగి బుధవారం బ్యాటింగ్‌కు దిగి 66.1 ఓవర్లలో 226 పరుగులకు ఆలౌట్ అయింది. అతనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 75 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 325 పరుగుల స్కోర్ వద్ద డిక్లేర్ చేసింది. దీంతో చిత్తూరు జట్టుకు 99 పరుగుల ఆధిక్యత లభిం చింది. ఇందులో ప్రణవ్‌గోవర్ధన్ 151 పరుగులు, మణిదీప్ 90 పరుగులు చేశారు. రెండో ఇన్నింగ్స్‌కు దిగిన నెల్లూరు జట్టు ఆట ముగిసే సమయానికి 4 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 26 పరు గులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసి నట్లు వెల్లడించారు.

కేవోఆర్ఎం మైదానంలో అనంతపురం-కర్నూలు జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో మొదటిరోజు (మంగళవారం) ఆట ముగిసే సమయానికి 45 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 174 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. తిరిగి రెండో రోజు బుధవారం బ్యాటింగ్‌కు దిగి మొత్తం 72 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 268 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఇందులో మోక్షజ్ఞతేజ్ 138 పరుగులు, హేమచందర్ నాయక్ 113 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 72 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 189 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఇందులో మోక్షజ్ఞరెడ్డి 90 పరుగులు చేశారు. దీంతో అనంతపురం జట్టుకు 79 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో అనంతపురం జట్టు ఆట ముగిసే సమయానికి 7ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 13 పరుగులు చేసింది. దీంతో ఆట డ్రాగా ముగిసినట్లు వెల్లడించారు.

కుటుంబ క్షేమం కోసం గొడవల జోలికెళ్లద్దు

● శాంతిభద్రతలకు విఘాతం కలిగేస్తే చర్యలు తప్పవు ● మాబ్ ఆపరేషన్, మాక్‌డ్రిల్ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ



మాట్లాడుతున్న ఏఎస్పీ ప్రకాశ్‌బాబు, కార్యక్రమంలో పాల్గొన్న పోలీసులు, ప్రజలు

చెన్నూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు బాగుండాలన్నా.. కుటుంబాలు క్షేమంగా ఉండాలన్నా... ఎలాంటి గొడవలకు వెళ్లవద్దని అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ప్రకాశ్‌బాబు ప్రజలకు సూచించారు. జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాధ్ ఆదేశాల మేరకు చెన్నూరులో బుధవారం సాయంత్రం పోలీసుల ఆధ్వర్యంలో మాబ్ ఆపరేషన్, మాక్‌డ్రిల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ ప్రజాశాంతికి భంగం కలిగించే అల్లరి మూకలను చెదరగొట్టడానికి పోలీసుశాఖ ఉంటుందని తెలియజేయడమే మాబ్ ఆపరేషన్, మాక్‌డ్రిల్ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. అదే సమయంలో ప్రజలు కూడా పోలీసుశాఖకు సహకరించాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం జిల్లాలో ఎక్కడైనా శాంతిభద్రత సమస్యలు తలెత్తినపుడు అల్లరి మూకలను ఏ విధంగా చెదర గొట్టాలో పోలీసులు మాక్‌డ్రిల్ ద్వారా ప్రజలకు వివరించారు. అంతేకాక చట్టాన్ని అతిక్రమించి హింసాత్మక చర్యలకు పాల్పడేవారిపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో చేసి చూపించారు. పోలీసుల హెచ్చరికలు వినకపోతే పైఅధికారుల అనుమతితో భాష్పవాయువు ప్రయోగించ డం, లాఠీచార్జి చేయడం, అప్పటికీ పరిస్థితి అదుపులోకి రాకపోతే ఫైరింగ్ లాంటి వాటిపై డెమో ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలను ప్రజలు ఆసక్తిగా తిలకించారు. అలాగే గ్రామాల్లో ఉత్సవాలు, ఊరేగింపులు, తిరునాళ్లు ఏదైనా ప్రత్యే క కార్యక్రమాల్లో ప్రజలు కలిసిమెలిసి శాంతియు తంగా నిర్వహించుకోవాలని అడిషనల్ ఎస్పీ సూచించారు. పరిస్థితి అదుపు తప్పితే నియంత్రించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటారన్న విష యాలన్న క్షుణ్ణంగా వివరించారు. గొడవల జోలికి వెళితే పోలీసుశాఖ తీసుకునే చర్యలతో భవిష్యత్తులో పడే ఇబ్బందులు, పోలీసు కేసులు, వారి పిల్లల జీవితాలపై పడే ప్రభావం గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ రమణ య్య, కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, చెన్నూరు సీఐ క్రిష్ణారెడ్డి, ఆర్ఐలు సోమశే ఖర్‌నాయక్, టైటాస్, శ్రీశైలంరెడ్డి, ఎస్ఐలు రామస్వామిరాజు, ఏఎస్ఐలు శంకర్‌నాయక్, ఆంజనేయులు, పోలీసులు, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.



మాక్‌డ్రిల్‌లో లాఠీచార్జి నిర్వహిస్తున్న పోలీసులు

రోగుల సౌకర్యార్థం రిమ్స్‌కు బస్సు



బస్సు సర్వీసులను ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

కడప సెవెన్ రోడ్స్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి):కడప నగర పరిధిలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి బుధవారం బస్సును ప్రారంభించారు. ఈబస్సు రిమ్స్ నుంచి పాత బస్టాండ్, పాత బస్టాండ్ నుంచి రిమ్స్ వరకు ప్రతిరోజు సర్వీసులను నడుపుతుంది. ఈ బస్సు సర్వీసులను ఆసుపత్రి ప్రాంగణంలో కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎమ్మెల్యే మాధవి ప్రారంభించారు. ప్రతిరోజు పాత బస్టాండ్ నుంచి ఉదయం 10, 11, 12గంటలకు,సాయంత్రం 4గంటలకు అందుబాటులో ఉంటుంది. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జమున, ఆసుపత్రి సూపరింటెండెంట్, సీఎస్ఆర్ఎంఓ తదితరులు పాల్గొన్నారు.

17న కార్పొరేషన్ ఎదుట సీపీఎం ఆందోళన

కడప సెవెన్‌రోడ్స్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కడప నగర పాలక సంస్థ ఏర్పడి నవంబరు 17 నాటికి 21 సంవత్సరాలు పూర్తైనా నేటికీ పంచాయతీల నుంచి విలీనమైన డివిజన్‌లలో ఎలాంటి అభివృద్ధి జరగడం లేదని సీపీఎం కడపనగర కార్యదర్శి రామమోహన్ తీవ్రంగా విమర్శించారు. బుధవారం నాడు కడపనగరంలోని మృత్యుంజయకుంటలో ఉన్న సీపీఎం కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డివిజన్లకు ప్రత్యేక నిధులుకేటాయించాలని డిమాండ్‌తో 17న కార్పొరేషన్ ఆఫీస్ వద్ద సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దస్తగిరిరెడ్డి, పార్టీ నగర కమిటీ సభ్యుడు చంద్రారెడ్డి, రామకృష్ణారెడ్డి, నరసింహ పాల్గొన్నారు.

వసతి గృహాల తనిఖీ

కడప ఎడ్యుకేషన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): యోగి వేమన విశ్వవిద్యాలయ వైస్ చాన్సెలర్ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ బుధవారం వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహాలలో తయారవుతున్న ఆహార పదార్థాలు రుచికరంగా ఉంటున్నాయా లేదా అంటూ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అల్పాహారాన్ని పరిశీలించారు. వంటగది పరిసరాలను చూశారు. డైనింగ్ హాల్లో విద్యార్థులు అల్పాహారం తింటుండగా వీసీ వారి వద్దకు వెళ్లి మాట్లాడారు.

ఘనంగా చాతుర్మాస వ్రత దీక్షలు



కోలాటం వేస్తున్న యువతులు

లింగాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలిదండ్ల దేవరకోన హరిహర క్షేత్రంలో నాలుగునెలలుగా నిర్వహిస్తున్న చాతుర్మాసవ్రత దీక్షలు బుధవారం ఘనంగా నిర్వహించి ముగించారు. ఈ సందర్భంగా యువతులు చేసిన కలశ ప్రదర్శన, కోలాటం ఆకట్టుకున్నాయి. దాతల సహకారంతో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భాగవత భక్తసమాజం అధ్యక్షుడు నారాయణరెడ్డి, దత్తరాజా, మునీంద్ర పీఠాధిపతి ఈశ్వరయ్యస్వామి తదితరులు పాల్గొన్నారు.

భర్త వేధింపులు భరించలేక మహిళ ఆత్మహత్య

బత్తలపల్లి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం ముస్తూరు గ్రామానికి చెందిన గాయత్రి(21) బుధవారం ఉరి వేసుకుంది. భర్త వేధింపులు భరించలేక తమ కూతురు ఆత్మహత్యకు పాల్పడిందని గాయత్రి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ సోమశేఖర్ తెలిపిన మేరకు, ముస్తూరుకు చెందిన హరిప్రసాద్‌కు కడప జిల్లా సింహాద్రిపురం మండలం నిడివెలగల గ్రామానికి చెందిన నిర్మల, సోమయ్య దంపతుల కూతురు గాయత్రితో ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. హరిప్రసాద్ కూలి పనులు చేస్తుంటాడు. ఆర్థిక ఇబ్బందులు ఉండటంతో అవసరానికి గాయత్రి తల్లిదండ్రులు సాయం చేసేవారు. కానీ ఆ డబ్బుతో హరిప్రసాద్ మద్యం తాగి, భార్యను ఇబ్బంది పెట్టేవాడు. భర్త వేధింపులు భరింలేకున్నానని, ఇక బతకనని గాయత్రి తల్లిదండ్రులకు ఫోన్ చేసి ఆవేదన వ్యక్తం చేసింది. అయితే వారు సర్ది చెప్పారు. అయినా ఫలితం లేకపోయింది. గాయత్రికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. సంఘటనా స్థలాన్ని ఎస్‌ఐ పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా కార్తీక పౌర్ణమి





కడప మృత్యుంజయకుంట శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు, చెన్నూరు..మల్లేశ్వరాలయంలో జ్వాలాతోరణం

చెన్నూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి సందర్భంగా మండలంలోని శివాలయాలు జ్యోతులతో దేదీప్యమానంగా వెలుగొందాయి. స్థానిక మల్లేశ్వరాలయంలో ప్రత్యేక అభిషేకాలు అలంకా రాలు జరిగాయి. మహిళలు పెన్నానదిలో స్నానమా చరించి దీపాలు వెలగించారు. అలాగే సాయంత్రం ఆలయంలో జ్వాలాతోరణం నిర్వహించారు. రాత్రి పల్లకీ సేవ చేశారు. వచ్చిన వారికి ప్రసాద వితరణ చేశారు. పుణ్యక్షేత్రమైన శివాలపల్లె కాశీవిశ్వేశ్వరాలయంలో శివదర్శనానికి మహిళలు తెల్లవారుజామున 2గంటల నుంచే వివిధ ప్రాంతలా నుంచి తరలివచ్చారు. కార్తీకదీపాలు వెలిగించి స్వామివారిని పూజించారు. చెన్నూరు ఆర్‌అండ్‌బీ రోడ్డులోని నాగేశ్వరాలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

వీరపునాయునిపల్లె..: మండలంలోని అనిమెల గ్రామ సమీపంలో ఉన్న సంగమేశ్వర ఆలయంలో బుధవారం భక్తులు కార్తీకదీపాలు వెలిగించారు. జ్వాలాతోరణ మహో త్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. వీఆర్‌ఎస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కాగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్రముఖ్య అధికార ప్రతనిధి డాక్టర్ తులసిరెడ్డి మండలం లోని సంగాలపల్లె శివకృష్ణ గోశాలలో గోశాలలో కార్తీక పౌర్ణమి మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకుడు కల్లూరు రాజశేఖర్‌రెడ్డి దంపతులు, పారిశ్రామికవేత్త నర్రెడ్డి శివప్రసాద్‌రెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు. కార్తీక పౌర్ణమి మహా మహిమాన్వితమైనది

చక్రాయపేట..: గండి క్షేత్రంలోని అంజన్న ఆలయం, శివాలయం, సురభిశివాలయం, మహ దేవపల్లె శివాలయం, రాచరాయ, వేంకటేశ్వర స్వామి దేవస్థానాలలో కార్తీకపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. మహిళలు కార్తీకదీపాలు వెలిగించి దీపోత్సవం చేపట్టారు. పాపాఘ్ని నదిలో మహిళలు పౌర్ణమి సందర్భంగా స్నానాలు ఆచరించి దీపాలు వదలి పూజలుచేశారు. అలాగే దేవరగట్టుపల్లె దశరథమహారాజు ఆలయం వద్దకోటి దీపోత్సవంకార్యక్రమం చేపట్టారు.

వేంపల్లె..: కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని వేంపల్లెలోని ఆలయాల్లో ప్రత్యేకపూజలలు నిర్వహించారు. పాతపేట భవాణి నీలకంఠేశ్వర ఆలయం, పాపాఘ్ని నదీ ఒడ్డున వెలసిన దుర్గా గవిమల్లేశ్వర ఆలయంలో స్వామివారికి అభిషేక పూజలు చేశారు. రాత్రి గవిమల్లేశ్వర ఆలయం వద్ద లక్షదీపోత్సవం వేడుకగా జరిగింది.

వల్లూరు..: కార్తీకమాసం పురస్కరించుకుని మండల పరిధిలోని పుష్పగిరి క్షేత్రానికి తెల్లవార జాము నుంచే భక్తులు తరలి వచ్చారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా ముందుగా పంచమనదిలో స్నానాలు ఆచరించి గట్టుపై గౌరీదేవిని మట్టితో కలిపి అనంతరం ఆమెకు పసుపు, కుంకుమ పెట్టి దీపాలు వెలిగించి పూజల అనంతరం ఆదీపాలను నదిలో వదిలిపెట్టారు. అనంతరం కొండపైన, లక్ష్మీచెన్న కేశవస్వామి సన్నిధిలో, గ్రామంలో ఉన్న వైద్య నాథేశ్వర ధ్వజస్తంభం ఎదుట దీపాలు వెలిగించారు. ఎస్‌ఐ పెద్దఓబన్న ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. సాయంం వేళ పుష్పగిరి ధర్మపరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గంగమ్మకు జలహారతితోపాటు అఖండ దీపం వెలిగించారు.వల్లూరులోని భవానీశంకర ఆలయంలో సాయంత్రం జ్వాలా తోరణం నిర్వహించారు.

సీకేదిన్నె..: చింతకొమ్మదిన్నె మండలంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా మండలంలోని బుగ్గశివాలయం, విశ్వనాథపురం శివాలయం, ఊటుకూరు శివాలయం, చింతకొమ్మదిన్నె శివాలయం, గంగమ్మతోపు శివాలయం, బయనపల్లె ఉమామహేశ్వర ఆలయంలో భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో అన్నదానాలు నిర్వహించారు. బయనపల్లె ఉమామహేశ్వర ఆలయంలో సత్యనారాయణస్వామి వ్రతం, జ్వాలా తోరణం నిర్వహించారు.

లింగాల..: కార్తీక పౌర్ణమి సందర్భంగా పార్నపల్లె కోనమల్లేశ్వర స్వామి ఆలయంలో మహిళలు లక్షదీపోత్సవం నిర్వహించారు. వనంబావి, సిద్ధలింగేశ్వర ఆలయంలో ఆర్‌ఐ గంగాధర్ యాదవ్ అన్నదానం నిర్వహించారు. లోపట్నూతల కాశినాయన ఆలయంలో గ్రామానికి చెందిన నాగభూషణంరెడ్డి అన్నదానం నిర్వహించారు.



వల్లూరు... పుష్పగిరి కొండపై ధ్వజస్తంభం వద్ద దీపాలు పెడుతున్న మహిళలు





చెన్నూరు..కాశీవిశ్వేశ్వరాలయంలో జ్యోతులు వెలిగిస్తున్న మహిళలు, చక్రాయపేట... పాపాఘ్ననదిలో స్నానాలాచరిస్తున్న భక్తులు



వీరపునాయునిపల్లెలో పూజలందుకుంటున్న సంగమేశ్వరుడు

సహకార సంస్థ ద్వారా ఎరువులు

లింగాల,నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): లింగాల సహకార సంస్థ ద్వారా రైతులకు నాణ్యమైన ఎరువులు అందిస్తామని సొసైటీ అధ్యక్షుడు నవీన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. లింగాల సొసైటీ ద్వారా బుధవారం రైతులకు యూరియా, డీఏపీ ఎరువుల పంపిణీని ఏఓ రమేష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మార్పీ కే ఎరువులు విక్రయించడం జరుగుతుందన్నారు. మరికొద్ది రోజుల్లో బిందుసేద్యం రైతులకు అవసరం అయిన డ్రిప్ ఎరువులను కూడా అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. సహకార సంస్థ సీఈఓ వినోద్‌రైతులు పాల్గొన్నారు.

వైవీయూ వీసీని కలిసిన ఎమ్మెల్సీ



కడప ఎడ్యుకేషన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వైవీయూ వైస్‌చాన్సెలర్ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్‌ను ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి వీసీ ఆచార్య రాజశేఖర్‌కు పుష్పగుచ్ఛం అందించి, శాలువ కప్పిసత్కరించారు.

'పులివెందుల ప్రజలంటే చిన్నచూపు'

పులివెందుల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పులివెందుల టీడీపీ నేతలకు ఇక్కడి ప్రజలంటే ఏమాత్రం అభిమానం లేదని కడప ఎంపీ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పులివెందుల మెడికల్ కళాశాల ఆసుపత్రికి వచ్చిన యంత్రాలు, వైద్య పరికరాలను ప్రభుత్వం మరోచోటకు తరలిస్తోందన్నారు. అయినా టీడీపీ నేతలు నోరుమెదపడం లేదన్నారు. పులివెందుల ప్రజలంటే టీడీపీ నేతలకు ఇంతచిన్నచూపా అని ఆయన పేర్కొన్నారు. మెడికల్ కళాశాల ప్రైవేటీకరణపై కోటిసంతకాల ఉద్యమాన్ని చేపట్టినా దానికి ప్రజల నుంచి స్పందన లభిస్తున్నా కూడా ప్రభుత్వం మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ వైఎస్ మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలయాల పునర్నిర్మాణానికి భూమిపూజ



బీటెక్ రవిని సన్మానిస్తున్న నాయకులు

పులివెందుల, నవంబరు 5 (ఆంధ్ర జ్యోతి): తొండూరు మండలంలోని భద్రంపల్లె గ్రామంలో ఆలయాల పునర్నిర్మాణానికి పులివెందుల నియోజక వర్గ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్ర నాథరెడ్డి (బీటెక్ రవి) భూమి పూజచేశారు. బుధవారం ఉదయం 9గంటల ప్రాంతంలో బీటెక్ రవి భద్రంపల్లెలోని శ్రీరాముని ఆలయం, గంగమ్మ దేవాలయాల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా బీటెక్ రవిని తొండూరుమండల టీడీపీ నాయ కులు శాలువ కప్పి పూలమాల వేసి ఆహ్వానించారు. అనంతరం ఆలయాల నిర్మాణాలకు బీటెక్ రవి కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శివమోహన్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అంతర్గత క్రమశిక్షణను పెంపొందించుకోవాలి

సీకేదిన్నె, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అంతర్గత క్రమశిక్షణను పెంపొందించుకోవాలని ప్రముఖ సినీరచయిత,నటుడు, వ్యక్తిత్వ వికాస నిపుణుడు ప్రదీప్ తెలిపారు. స్థానిక రాయచోటి రోడ్డులోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో పెంపొందించుకున్న జ్ఞానం భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడుతుందని, విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వం వచ్చినప్పుడే వారి జ్ఞానం పెంపొందుతుందన్నారు. అన్నమాచార్య విద్యాసంస్థల అధినేత డాక్టర్ చొప్పా గంగిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని చేరుకునేందుకు పట్టుదలతో కృషి చేయాలన్నారు. వైస్‌చైర్మన్ చొప్పా యల్లారెడ్డి మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువ ఇంజనీర్లపైనే ఆధారపడి ఉందన్నారు.

కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సుధాకర్‌రెడ్డి, హెచ్‌అండ్‌ఎస్ విభాగాధిపతి డాక్టర్ కె.ఎన్.శశికుమార్, వివిధ విభాగాల అదిపతులు,అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ఏవో రామసుబ్బారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.





హాజరైన విద్యార్థులు, విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కలిగిస్తున్న సినీ రచయిత ప్రదీప్

నిత్యాన్నదాన భవన నిర్మాణానికి భూమిపూజ

చక్రాయపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చక్రాయపేటలో వెలసిన వేంకటేశ్వర, రాచరాయ దేవస్థాన ఆవరణంలో నిత్యాన్నదాన భవన నిర్మాణానికి భూమిపూజా కార్యక్రమం నిర్వహించారు. బుధవారం కార్తీకపౌర్ణమి సందర్భంగా అనుస్వామి పూజలు చేశారు,దేవస్థాన చైర్మన్ లాయర్ రామాంజులరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు బాలే రామాంజనేయరెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన పవిత్రోత్సవాలు

చక్రాయపేట, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో నాలుగు రోజులుగా జరుగుతున్న పవిత్రోత్సవాలు బుధవారం మహాపూర్ణాహుతితో ఘనంగా ముగిశాయి. ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు కేసరి, ఉపప్రధాన అర్చకుడు రాజారమేష్ అధ్యక్షతన తిరుమలకు చెందిన వేదపండితులు బీవీ రామానుజాచార్యులు, వేదపా రాయణ పండితులు వారి బృందం రామ్మోహన్‌శర్మ హోమాలు నిర్వహిం చారు. మహాపూర్ణాహుతితో పాటు త్రికాల ఆరాధన, పంచసూక్త హోమం, పంచముఖ హనుమాన్ అంజనేయస్వామి మూలమంత్ర హోమం, సుదర్శన హోమం, పవిత్ర విసర్జనకుంభ విద్వాసన, మహాకుంభప్రోక్షణ, నివేదిన, శాత్తుమురై తదితర పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి మరింత కృషి : ఎమ్మెల్యే

మైదుకూరు రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తిరుమలనాథస్వామి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం తిరుమలనాథస్వామి కల్యాణం, గిరిప్రదక్షిణ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఉదయం నుంచి భక్తులు విరివిగా పాల్గొని పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం తిరుమలనాథస్వామి ఊరేగింపులో భాగంగా ఏర్పాటు చేసిన గిరిప్రదక్షిణలో ఎమ్మెల్యే పాల్గొని ఆలయ అభివృద్ధిలో భాగంగా గిరిప్రదక్షిణకు కొండను తొలచి రోడ్డు వేయడం జరిగిందని, మరింత అభివృద్ధికి కృష చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కనీసవేతనాల కమిటీ డైరెక్టర్ దాసరి బాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏపీ రవీంద్ర, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ యాపరాల చిన్న, ఆలయ ధర్మకర్త మండలి సభ్యుడు హజరత్‌రెడ్డి, బండి అమర్‌నాథ్, తుపాకుల రమణ, బాలమునెయ్య, రేనాడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ నూతన కార్యాలయం ప్రారంభం

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో నూతనంగా నిర్మించిన మండల విద్యాశాఖ కార్యాలయాన్ని బుధవారం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, వాల్మీకి బోయ కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు, ప్రతాప్, టీడీపీ పట్టణాధ్యక్షుడు చల్లా రాజగోపాల్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

పోరుమామిళ్ల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఐ ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం వారు రాచాయిపేట, రంగసముద్రంతో పాటు గురప్పగారిపల్లె తదితర ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు ఎంవీ సుబ్బారెడ్డి, టి.భాస్కర్, బాలు, పిడుగు మస్తాన్, రవికుమార్ మాట్లాడుతూ పోరుమామిళ్ల, కాశినాయన మండలాల్లో వర్షానికి దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందించాలన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

కాశినాయన, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని పోరుమామిళ్ల పశువైద్య సంచాలకులు డాక్టర్ చంద్రశేఖర్, మండల పశువైద్యాధికారి డాక్టర్ అశోక్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం అంభవరం గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్, ఆంధ్రప్రదేశ్ పశు సంవర్ధక శాఖ, ఆంధ్రప్రదేశ్ పశు గణాభివృద్ధి సంస్థ ఉమ్మడిగా ఉచిత పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పశువులకు గర్భకోశ వ్యాధుల పరీక్షలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణా మందులు అందించారు.

వరిలో సస్యరక్షణ చర్యలు

దువ్వూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): వరి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి అమర్‌నాథ్‌రెడ్డి సూచించారు. మండలంలోని బయనపల్లె గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం వరి పంటను ఆకుముడత పురుగు ఆశించిందని, పొట్టదశలో ఉన్న వరిని ఈ తెగుళ్ల దెబ్బతీస్తుందని, రైతులు తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.

చర్యలు తీసుకోవాలి

జమ్మలమడుగు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని రంగసాయిపురం ప్రజలు కోరారు. ఈ మేరకు బుధవారం వారు స్థానిక ఆర్డీవో కార్యాలయంలో పరిపాలన అధికారి ఇక్బాల్‌బాషాకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంగసాయిపురం గ్రామంలో నీళ్ల ట్యాంకు దగ్గర సిమెంటు రోడ్డు పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించి కట్టడాలు నిర్మించారని, ఇందుకు సంబంధించి కలెక్టర్ కార్యాలయంలో కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

క్రీడల్లో విద్యార్థిని ప్రతిభ

రాజుపాలెం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): వెల్లాలలోని గురుకుల పాఠశాల విద్యార్థిని ఎం.నాగవేణి బుధవారం ఎస్‌జీఎఫ్ స్కూలుగేమ్స్ ఫెడరేషన్ డిస్ట్రిక్ట్ సెలక్షన్స్ బుధవారం కడపలో నిర్వహించిన లాంగ్ జంప్, హైజంప్‌లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తులశమ్మ తెలిపారు. శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని, ఈ సందర్భంగా విద్యార్థినిని అభినందించారు.

మున్సిపాలిటీ వసతులేవీ..?

- మౌలిక సదుపాయాలకు నోచుకోని మైదుకూరు
- ప్రధాన రహదారుల్లో డ్రైనేజీ, ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన దుకాణదారులు
- ఆక్రమణలపై చర్యలకు సాహసించని అధికారులు, ప్రజాప్రతినిధులు
- పార్కింగ్ స్థలాలు లేక రోడ్లపైనే నిలుపుతున్న వాహనాలు

మైదుకూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీగా ఉన్న మైదుకూరు.. మున్సిపాలిటీగా మారి 13 సంవత్సరాలైనప్పటికీ ఇంతవరకూ మౌలిక వసతులకు నోచుకోలేదు. ఎలాంటి ఎదుగూబొదుగు లేకుండా ఇంకా వెనకబడే ఉంది అని చెప్పవచ్చు. ఇక్కడ ప్రధాన రహదారులలో తిరగాలంటే పద్మవ్యూహం ఛేదించినట్లే. నడవడానికి ఫుట్‌పాత్ లేక రోడ్లపై తిరగాలన్నా, రోడ్లు దాటాలన్నా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలను నిలుపుకోవడానికి పార్కింగ్ స్థలాలు లేక పోలీసులు వేసే ఫైన్లతో మైదుకూరుకు రావాలంటే వాహనదారులు భయపడుతున్నారు. నాలుగు ప్రధాన రహదారులలో ఉన్న డ్రైనేజీలు దుకాణాదారుల ఆక్రమణలకు గురయ్యాయి. దీంతో ఆ షాపులలోని వ్యర్థాలతో కాలువలు నిండడం వలన నీరు పోయేందుకు వీలులేక వర్షాలకు కాలువలలోని మురుగు బయటకు వచ్చి రోడ్లన్నీ మురుగు కుంటలను తలపిస్తున్నాయి. మున్సిపల్ అధికారులు దుకాణాదారుల నుంచి పన్నుల వసూళ్లలో చూపే ఉత్సాహం మౌలిక వసతు కల్పన కు శ్రద్ధ చూపడంలేదని పట్టణవాసులు వాపోతు న్నారు. ఆక్రమణలపై అధికారులు చర్యలు తీసుకోవాలంటే రాజకీయనాయకుల ఒత్తిడులతో ఏమీ చేయలేకున్నారు. ప్రధాన రహదారులలో చెత్తకుండీలు అపరిశుభ్రతకు కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. మున్సిపల్ అధికారుల అలసత్వంతో చెత్తకుండీలను సమయానికి తీయకపోవడంతో ప్రజలు వ్యర్థాలన్నీ రోడ్లమీదనే వేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, పాలకులు మైదుకూరు అభివృద్ధిపై దృష్టి పెట్టి, రాజకీయాలకు అతీతంగా చట్టపరంగా ఆక్రమణలను తొలగించి, ఫుట్‌పాత్‌లను, పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు. ప్రస్తుతం జరుగబోయే కౌన్సిల్ సమావేశంలో మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి కార్యాచరణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


పార్కింగ్ లేక వాహనదారుల అవస్థలు

ఆక్రమణల తొలగింపునకు చర్యలు

మైదుకూరు పట్టణంలో ఆక్రమణల తొలగింపునకు స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడి చర్యలు తీసుకుంటాం. ఆ మేరకు ఆక్రమణదారులకు నోటీసులు అందించి పట్టణాన్ని అన్ని విధాల అభివృద్ధి పరుస్తాం.

- రంగస్వామి, మున్సిపల్ కమిషనర్, మైదుకూరు


ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన దుకాణదారులు..



డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో రోడ్లపైనే వర్షపునీరు

ప్రతి నెల పౌర హక్కుల దినోత్సవం జరపాలి

జమ్మలమడుగు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు డివిజన్‌లో ప్రతినెల పౌర హక్కుల దినోత్సవం జరపాలని రాష్ట్ర మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు రామాజీ ఇమ్మానుయేల్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, అనంతరం ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ఏవో ఇక్బాల్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితులపై మానసిక దాడులు, భౌతిక దాడులు, అత్యాచారాలు జరుగుతున్న నేపథ్యంలో చట్టాలపై అవగాహన పెంచేందుకు పౌరహక్కుల దినోత్సవం నిర్వహంచాలని అనేకసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించడం లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు తాళ్లపాక వినోద్‌కుమార్, వెంకటరమణ, మురళీప్రసాద్, సంగటి పుల్లయ్య, సాగర్, యేసురత్నం, శేఖర్, చక్రవర్తి పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

పోరుమామిళ్ల/అట్లూరు/కాశినాయన, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొంది సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నవారికి నిధులు మంజూరు కావడంతో బుధవారం ఆ చెక్కులను మాజీ ఎమ్మెల్యే విజయమ్మ లబ్ధిదారులకు అందించారు. పోరుమామిళ్లకు చెందిన ఓ.రమణమ్మకు రూ.67వేలు, షాహిదాకు రూ.43వేలు, ఏరువ లక్షుమ్మకు రూ.53వేలు, అలాగే అట్లూరుకు చెందిన దున్నుతుల ఎల్లారెడ్డికి రూ.47327, రెడ్డిపల్లెకు చెందిన బోవిళ్ల చంద్రారెడ్డికి రూ.25వేలు, కాశినాయన మండలం శివరాం పాలగిరికి చెందిన గజ్జెల సాంభశివారెడ్డికి రూ.32వేల చెక్కులను స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆమె అందించారు. కార్యక్రమంలో నర్సాపురం సహకార సంఘం చైర్మన్ బంగారు గుర్విరెడ్డి, మార్కెట్‌యార్డు వైస్‌చైర్మన్ రవీంద్రారెడ్డి, సావిశెట్టిపల్లె టీడీపీ నాయకుడు వేణుగోపాల్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి రవీంద్రారెడ్డి, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

కిచెన్‌షెడ్డు పనులు వేగవంతం చేయాలి

బ్రహ్మంగారిమఠం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ కిచెన్ షెడ్డు పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో వై.రామచంద్రారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నిర్మాణ పనులను పంచాయతీరాజ్ డీఈ మధుసూదనరావు, టీడీపీ నాయకుడు చెన్నుపల్లె సుబ్బారెడ్డి, ఏఈ మురళీ పరిశీలించారు.

డ్వాక్రాసంఘాల అభివృద్ధికి కృషి

డ్వాక్రాసంఘాల అభివృద్ధికి వెలుగు సిబ్బంది కృషి చేయాలని ఎంపీడీవో రామచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం వెలుగు పథకం శాఖపై కమ్యూనిటీ కోఆర్డినేటర్లతో సమావేశమయ్యారు. డ్వాక్రా సంఘాల జీవనోపాధులు పెంపొందించాలని, అందుకు అవసరమైన రుణాలను మంజూరు చేయించాలన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

రాజుపాలెం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీజేపీని బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జగ్గటి వెంకటసుబ్బారెడ్డి అన్నారు. బుధవారం వెల్లాలలో మండల స్థాయి బీజేపీ నాయకుల సమావేశం నిర్వహించారు.

బాలికలు అన్ని రంగాల్లోనూ రాణించాలి

ముద్దనూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): బాలికలు బాలురతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని ఐసీడీఎస్ సీడీపీవో కొండమ్మ అన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థునులకు బహుమతులు అందజేశారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా అక్టోబర్ 11న ప్రాజెక్టు పరిధిలోని ముద్దనూరు, ఎర్రగుంట్ల, కొండాపురం మండలాల ఉన్నత పాఠశాలలోని కిశోర బాలికలకు బాలికల విద్య, బాల్యవివాహాలు అన్న అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజ్యలక్ష్మి, ఓబులేసు, అంగన్వాడీ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

శివాలయాన్ని దర్శించిన న్యాయాధికారి సురేంద్రనాధరెడ్డి



ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు కోర్టు న్యాయాధికారి సురేంద్రనాధరెడ్డి శివాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం రాత్రి ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వంగల నారాయణరెడ్డి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

పంట మార్పిడి చేయాలి

కొండాపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రైతులు పంట మార్పిడి విధానాన్ని అవలంబించాలని ఏడీఏ రామమోహన్‌రెడ్డి, ఏవో రామాంజులరెడ్డి తెలిపారు. మండలంలోని గండ్లూరు రెవెన్యూ పొలంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దానిమ్మ పంటను పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశం నిర్వహించి దానిమ్మ పంటలో తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

అభివృద్ధిని అడ్డుకుంటున్న రాచమల్లు : టీడీపీ


మాట్లాడుతున్న ముక్తియార్

ప్రొద్దుటూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులో టీడీపీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని వైసీపీ మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి అడ్డుకుంటున్నారని మున్సిపల్ మాజీ ఇన్‌చార్జ్ చైర్మన్ వీఎస్ ముక్తియార్ ఆరోపించారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నోటీసులు ఇవ్వకుండా రోడ్డు విస్తరణలో భవనాలు కూల్చవద్దని మాట్లాడే రాచమల్లు వైసీపీ ప్రభుత్వంలో మార్కెట్‌ను కూల్చేటప్పుడు నోటీసులు ఇచ్చారా అని ప్రశ్నించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఈవీ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఎగ్జిబిషన్ బకాయిలు చెల్లించే వరకు రాచమల్లు రిలే దీక్షలు చేపట్టడం హాస్యాస్పదంగా వుందన్నారు. 2019నుండి 2023వరకు వైసీపీ హయాంలో బకాయి పడ్డ డబ్బులు చెల్లించి కూర్చుంటే అర్థం వుంటుందన్నారు. కార్యక్రమంలో వాల్మీకిబోయ కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు, మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి, కౌన్సిలర్ కమాల్, మాజీ కౌన్సిలర్ తలారీ పుల్లయ్య పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించేవరకు పోరాటం : రాచమల్లు

ప్రొద్దుటూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఎగ్జిబిషన్ లీజు బకాయిలను చెల్లించేవరకు పోరాడతానని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు వైసీపీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా ఎగ్జిబిషన్ లీజును మున్సిపల్ కమిషనర్ ప్రభుత్వ గెజిట్‌కు విరుద్ధంగా లీజు డబ్బులు చెల్లించకుండానే టీడీపీ కాంట్రాక్టర్‌కు అనుమతులు ఇచ్చారని, లీజు గడువు ముగుస్తున్నా ఇంకా కోటి రూపాయలు మున్సిపాలిటీకి చెల్లించలేదన్నారు. 2014 నుండి వున్న ఎగ్జిబిషన్ బకాయిలన్నీ కూడా వసూళ్లు చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మను ఖాజా బంగారురెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అయితే ఈ దీక్షాశిబిరంలో రాచమల్లు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. టీడీపీ నాయకుడు దొరసానిపల్లె సర్పంచ్ ఈశ్వరమ్మ భర్త అరవ మునివర క్రికెట్ బెట్టింగ్, జూదం ఆడుతుంటే వన్‌టౌన్ పోలీసులు పట్టుకున్నారని, వెంటనే ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఫోన్ చేస్తే వదిలేశారన్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆకుకూరలు తినే హింసావాది అన్నారు. ఈ ప్రెస్‌మీట్‌ను సోషల్ మీడియాలో చూసిన సర్పంచ్ ఈశ్వరమ్మ, ఆమె భర్త అరవ మునివర దీక్ష చేస్తున్న రాచమల్లును ప్రశ్నించారు. తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

శంభో.. శివశంభో.. శివశివశంభో..

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని శివాలయాలు భక్తులతో సందడిగా మారాయి. తెల్లవారుజాము నుండి భక్తులు ఆలయాలకు చేరుకుని స్వామివారిని దర్శించుకుని అభిషేకాలు చేసి కార్తీక దీపాలు వెలిగించారు. ప్రొద్దుటూరు శివాలయం, రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయం, హనుమత్ లింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు స్వయంగా అభిషేకాలు చేశారు. అలాగే నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని శివాలయాల్లో ఉదయం, సాయంత్రం భక్తులు కార్తీక దీపాలు వెలిగించడంతో ఆలయాలు కార్తీక శోభను సంతరించుకున్నాయి.


ప్రొద్దుటూరు శివాలయంలో..


మైలవరం అగస్త్యేశ్వరస్వామి కోనలో..


ఎర్రగుంట్లలో సత్యనారాయణ వ్రతం..


ముద్దనూరు: ఆర్‌జీపల్లె శివాలయంలో స్వామివారికి ప్రత్యేక అలంకరణ


కొండాపురం శివాలయంలో..


కాశినాయన చెన్నవరంలో..


దువ్వూరు భీమలింగేశ్వర ఆలయంలో..